




*తెలుగు జానపద గీతాలకి, జనపద సంగీతానికి కొత్త ప్రాణం పోసిన విదుషీమణి 'కళాప్రపూర్ణ' శ్రీమతి అవసరాల(వింజమూరి)అనసూయాదేవిగారి గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 92 సంవత్సరాల వయసులో ఆమె వ్రాసిన వ్యాస పరంపర ఇది. అనసూయదేవిగారి సుదీర్ఘ జీవనప్రయాణంలో ఆమె కలుసుకున్న ప్రముఖ వ్యక్తులతో తన పరిచయాల గురించి ఈ శీర్షికలో వివరిస్తున్నారు.*

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## ఎస్.పి.వసంత కోకిలమ్

నేనెరిగిన మధురాతి మధురమైన గాత్రాలలో ఈమెది మొదటిది. రెండవ మధుర గాత్రం, ప్రసిద్ధి కెక్కిన హిందూస్థానీ సంగీత గాయకురాలు పర్వీన్ సుల్తానాది. నేను వసంత కోకిలమ్‌తో అనేదాన్ని - 'నీ తల్లి తండ్రులు నీకు చిన్నతనంలోనే తేనె, మావి చిగుళ్ళు, అతి మధురం, వెన్న కలిపి నూరి ఉగ్గుపాలలో రంగరించి పెట్టి ఉంటారు. అందుకే నీకు కోయిల గొంతు అబ్బింది. సార్థక నామధేయురాలవని' ఆమె మనస్సు కూడా ఆమె గొంతులాగా వెన్నలాంటిది. మద్రాసు ఎల్డామ్స్ రోడ్‌లో ఉన్న ఆమె ఇంటికి తరచు వెళ్ళేదాన్ని. ఎన్నో విషయాలు గంటల తరబడి మాట్లాడుకునే వాళ్ళం. నా పెళ్ళి ఏర్పాటుకు తోడ్పడిన వారిలో వసంత కోకిలమ్ భర్త సాచీగారొకరు.

1947లో అనుకుంటాను, వసంత కోకిలమ్ రెండు తెలుగు జాతీయ గీతాలు గ్రామఫోన్ రికార్డు చేయదలచింది. నన్ను సంగీతం కూర్చమని అడిగింది. మామయ్య కృష్ణశాస్త్రి వ్రాసిన 1.కోటి చేతులు చాపి, కాటకమ్మే తిరుగు నేటి భారతభూమిలో (పీలూ మిశ్ర) 2. ఆ దిశాంతము తాకి, ఈ దిశాంతము సోకి ఆదిశక్తీ నీ కపాలమాల (రాగమాలిక) - ఈ రెండు పాటలు ఎన్నుకుని, వసంతకోకిలాన్ని మనస్సులో పెట్టుకుని, ఆమెకు అనుగుణ్యమైన సంగీతం కూర్చాను. ఆమె ఈ పాటలు ఎంతో శ్రావ్యంగా, తెలుగు ఉచ్చారణ చెడపకుండా, భావయుక్తంగా పాడేది.

వసంతకోకిలమ్ కొన్ని తమిళ పిక్చర్సులో నటించింది కూడా. ఆమె సంగీత జీవితం మంచి ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు, చిన్న వయస్సులోనే మరణానికి గురైంది. జాతీయగీతాలు రికార్డింగ్ జరగటానికి ముందే, అటువంటి గాయని చేత నా పాటలు రికార్డింగ్ చేయించుకోలేకపోవటం నా దురదృష్టం కూడాను. వసంతకోకిలమ్ కోసం నేను సంగీతం కూర్చిన రెండు పాటలూ, ఆమెలాగ ఎవరూ పాడలేరేమో అని ఎవరికీ నేర్పలేదు, నేనూ పాడలేదు

కర్ణాటక సంగీత నొటేషన్ తో నేను ప్రచురించిన 'భావగీతాలు' పుస్తకంలో మాత్రం ఉన్నాయని జ్ఞాపకం.

***ద్వారం వెంకటస్వామి నాయుడుగారు***

వీరి కుటుంబంతో మాకు 75 ఏళ్ళ స్నేహం. అత్యంత ఆప్తులు. నాయుడుగారు, వారి అన్నగారు, అన్నగారి కుమారులు ద్వారం నరసింగరావుగారు ప్రతీ సంవత్సరం సరస్వతీ గానసభలో పాల్గొనడానికి వచ్చేవారు. తరచూ నరసింగరావుగారు వయొలిన్ మీద, నాయుడుగారికి ప్రక్క వాద్యం వాయించేవారు.

నాయుడుగారి వయొలిన్ కచేరీని వినాలి కానీ వర్ణించటం కష్టం. ఆయనది ఇంపైన వాద్యం. ప్రతీ బిట్ తీర్చిదిద్దినట్టుండేది. కచేరీ రక్తిమయం. నా చిన్నతనంలో నాయుడుగారి వయొలిన్ కచేరీని వింటున్నప్పుడూ ఏమనిపించిందంటే, వారి 'కమాను' ముందు, వినయంగా, సున్నితంగా, అతి మార్దవంగా వాద్యం మొదలు పెట్టి, తర్వాత 'ఎక్స్టసీస్'కి వెళ్ళి, శ్రోతలను పరవశింపచేసేది. ఆ మహత్తు కమానులో ఉందో ఆ పలికించే వారి వ్రేళ్ళలో ఉందో!

ఆ రోజుల్లో ఆంధ్రాలో కొన్ని చోట్ల, నాయుడుగారి వయొలిన్ కచేరీతోపాటు, నా లలిత సంగీత కచేరీ కూడా ఒకే స్టేజీమీద ఒకదాని తర్వాత ఒకటి ఏర్పాటు చేయటం జరిగింది. వారు మహానుభావులు. వారి ముందు నేనెంతటిదాన్ని! అయినా ఎందుకు వ్రాస్తున్నానంటే, నా ఫీల్డులో నేను టాప్‌సింగర్‌నే. ఆ రోజుల్లో నాకుండే పాపులారిటికీ ఏమీ తక్కువలేదు. పెద్దలు వారి కచేరీతో నాదీ కలిపి పెట్టడం వల్ల, నా గౌరవం ఇంకా పెరిగింది.

ద్వారం వారి కుటుంబంతో మాకు చాలా సాన్నిహిత్యం. నాయుడుగారి అబ్బాయిలు భావనారాయణ, సత్యనారాయణ, బాబు, మంగతాయారు, పాప నా కత్యంత ఆప్తులు. నా పిల్లలైదుగురూ పుట్టే ముందు, నాయుడుగారి భార్య చేతివంట, ముఖ్యంగా వంకాయకూర తినకుండా పురిటికి వెళ్ళలేదు.

ఒక సంఘటన మరిచిపోలేను. వెంకటస్వామి నాయుడుగారి షష్టిపూర్తి వైభోపేతంగా జరిపారు మద్రాసులో. ఆ సందర్భంలో మామయ్య కృష్ణశాస్త్రి, నాయుడుగారి మీద వ్రాసిన 'నీ ఆశీస్సుమ రసి చల్లుమా ఓ సరస్వతీ కళాధిదేవత. మా ద్వారముపై' పాటను పాడే అదృష్టం కలిగింది నాకు. సభానంతరం నాయుడుగారు, మేమూ ఒకే కారులో ఎక్కాం ఆ సందర్భంలో నాయుడుగారి చెయ్యికారు తలుపులో పడి నలిగితే, నేను భయపడి పోయి ఫెయింట్ అయ్యాను. ఆ పవిత్రమైన చేయికి ఏమైందో అని భయపడి. భగవంతుని దయవల్ల ఏమీ ప్రమాదం జరగలేదు.

ద్వారం వెంకటస్వామిగారి వయొలిన్ విన్న ప్రతివారూ నేను వ్రాసిన దానిలో లేశమంత అతిశయోక్తి లేదని ఒప్పుకుంటారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వయొలిన్ విద్వాంసులు యహూడి మెనుహిన్ అంతటివారు, ద్వారం వెంకటస్వామి నాయుడుగారి వయొలిన్ వాయిద్యాన్ని ఎంతగానో మెచ్చుకున్నారని చెప్పుకుంటారు.

***అరియకుడి రామానుజ అయ్యంగారు***

అలనాటి మేటిగాయకుల్లో ఒకరు. నిండైన గాత్రం వీరిది. వీరిపాటలో విశిష్టత ఉంది. పలుకు స్వచ్ఛంగా ఉండేది. ఈయన గొంతులో గమకం కూడా చిత్రంగా పలికేది - జున్ను ముక్కలు విరిగినట్టు. ప్రతీ సంవత్సరం తప్పని సరిగా కాకినాడ సరస్వతీ గానసభలో పాడడానికి వచ్చేవారు. రామానుజయ్యంగారి కచేరీ మొదటినుండి చివర వరకూ రక్తిగా ఉండేది. హాలులో స్థలం ఉండేదికాదు. జనం కిటకిటలాడిపోయేవారు. వీరి రాగం తానం పల్లవి హైలైట్. చాలా స్పెషల్‌గా ఉండేది. సమ ఉజ్జీలైన వయొలిన్, మృదంగ వాద్యకారులు ప్రక్క వాద్యాలమర్చేవారు. ఈ ముగ్గురూ, ఒకరికొకరు తీసిపోకుండా పోటీ పడిన రాగం, తానం, పల్లవి మహా సరదాగా, వీనులకు విందుగా, పసందుగా ఉండేది. ఇది అయ్యేటప్పటికి ముగ్గురి జుట్టుముడులూ ఊడిపోయేవి. శ్రోతలు చప్పట్లు చరుస్తూ ఉంటే, వీరు ముగ్గురూ వారి జుట్టు ముడివేసుకునేవారు.

సరస్వతీ గానసభలో పాడడానికి వచ్చిన గాయకుల్ని మా ఇంటికి భోజనానికి పిలవటం మా నాన్నగారికి పరిపాటే. ఆ రోజు రామానుజయ్యంగారికి, వారి బృందానికి మా ఇంట్లో విందు. భోజనాలయ్యాక యథాప్రకారం నాచేత ఒక పాటపాడించారు. నాకు పదో పదకొండో ఏళ్ళుంటాయి. అదేమిటో పెద్దల ముందు పాడడానికి కూడా జంకేదాన్నికాను. నా పాట విన్నాక నన్ను ఆశీర్వదించి , 'నా దగ్గర ఈ పాట నేర్చుకో' అని, జింగ్లా రాగంలో, 'దశరథ సుత, సురగణనుత, దశదిశఖ్యాత రామా' అనే పాట నేర్పించారు. ఆయన నేర్పే గమకాల్ని తు.చ. తప్పకుండా నేను పలుకుతుంటే సంతోషించి, ఇంకా గమకయుక్తంగా నేర్పించి, నేను బాగా అనుకరించినందుకు మెచ్చుకుని ఆశీర్వదించారు. ఇటువంటి పెద్దల ఆశీస్సులు నా భావికి పునాదులయ్యాయి.

***<u>ఎం.ఎస్.సుబ్బులక్ష్మి</u>***

1938లో మొదటిసారి ఎం.ఎస్ సుబ్బులక్ష్మి గారిని, మద్రాసు త్యాగరాయనగర్‌లో వై.జి.దొరస్వామిగారింట్లో కలిశాను. వై.జి.పార్థసారథి, దొరస్వామి సోదరులు. వైదేహి, శ్రీమతి వీరిచెల్లెళ్ళు. వీరి కుటుంబం కూడా సంగీత కుటుంబమే. మేము పక్కపక్కనే ఉండేవారం టి.నగర్‌లో. వీరికుటుంబంతో ఇట్టే స్నేహం కుదిరింది. దొరస్వామిగారి అమ్మగారికి నేనంటే ప్రత్యేకాభిమానం. నా పద్దెనిమిదవ పుట్టినరోజు వారింట్లో జరిపించారు.

ఈ నా 90 పుట్టినరోజుల్లోను - నేను చెప్పుకోదగ్గ పుట్టిన రోజది. మరిచిపోలేని మధురానుభవం. నేను పదే పదే చెప్పుకునే ప్రత్యేక సంఘటన. ఎందుకంటే గౌరవనీయులైన కొందరు పెద్దలు, సంగీత ప్రియులే కాకుండా, ఎం.ఎస్.సుబ్బులక్ష్మిగారు 'మంగమ్మ శపథం' హీరోయిన్ వసుంధర (వైజయంతిమాల తల్లి) నా స్నేహితురాలు, మా పిఠాపురం మహారాజావరమ్మాయి సీతాదేవిగారు (తర్వాత హిజ్ హైనెస్ ది మహారాజా ఆఫ్ బరోడాను పెళ్లాడారు). పిఠాపురం యువరాజుగారు మొదలైన వారు వచ్చారు.

తర్వాత సుబ్బులక్ష్మిగారు చాలాసేపు పాడారు. దొరస్వామిగారు మృదంగం వాయించారు. వసుంధర, వైదేహి, శ్రీమతి, నేనూ కూడా పాడాం. ఎం.ఎస్.గారితో మొదటి పరిచయం అలాగైంది. ఈ గ్రూపులో ఒక్క వసుంధరకి తప్ప మరెవరికీ అప్పటికింకా పెళ్లికాలేదు.

తర్వాత ఎన్నో సందర్భాలలో సుబ్బులక్ష్మిగారిని కలుస్తూండేదాన్ని. ఆమె నిగర్వి, భేషజం లేని మనిషి, ఎంతో ఆప్యాయంగా పలకరించి మాట్లాడేవారు.

1940-41లో నేను మద్రాసు రేడియోలో మ్యూజిక్ కంపోజర్‌గా పనిచేశాను. ఆ రోజుల్లోనే ఓరియంటల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఏజెంట్‌గా ఉండేదాన్ని. మద్రాసులో మా మెయిన్ ఆఫీసు ఆర్మీనియన్ స్ట్రీట్ కార్నర్‌లో ఉండేది. ప్రఖ్యాత హిందూస్థానీ సంగీత విద్వాంసులు దిలీప్ కుమార్ రాయ్‌గారు, ఎప్పుడు మద్రాసుకు వచ్చిన, ఆ బిల్డింగ్‌లో బసచేసేవారు. వీరు ఆచంట జానకిరాం గారికి స్నేహితులు. మీరా భజన్స్ నేర్చుకోడానికి జానకి రామ్‌గారు, నన్నక్కడకు తీసుకువెళ్ళేవారు. సుబ్బులక్ష్మిగారు కూడా మీరా భజన్లు నేర్చుకోవడానికి వచ్చేవారు. 1944-45లో సుబ్బులక్ష్మిగారు మీరాబాయిగా (తమిళం, హిందీ వెర్షన్సులో) సినిమాలో నటించారు. ఆమె మధుర గాత్రంతో పాడిన పాటలు ఇప్పటికీ మరచిపోలేము. చిత్రమేమిటంటే - అదే టైంలో (ముందో, వెనకో జ్ఞాపకంలేదు) తెలుగులో 'మీరాబాయి' తీశారు. అడివి బాపిరాజుగారు కళాదర్శకుడు, నన్ను మీరాబాయి వేయించాలని చాలా ప్రయత్నించారు, నేను వేయలేదు. చలం అనే ఆమె మీరాబాయిగ నటించారు.

సుబ్బులక్ష్మిగారితో ఉన్న ఈ కొద్ది పరిచయం కూడా మహద్భాగ్యంగా తలుస్తాను. వివిధ సందర్భాల్లోనూ సభల్లోనూ తరచు కలిసేదాన్ని. మా పిల్లలు రత్నపాప, సీతల నాట్యప్రదర్శనానికి వచ్చి ఆశీర్వదించారు. ఈమె సదాశివంగారిని వివాహమాడాక, కొద్దిసారులే కలిశాను.

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఎం.ఎస్ సుబ్బులక్ష్మి గొప్ప గాయని, గొప్ప గాత్రం, గొప్ప పెర్సనాలిటీ. ఈమె సంగీతం వీనులకు, కన్నులకూ కూడా విందుగొల్పేది. సాంప్రదాయ పద్ధతిలో కట్టిన కంజీవరం పట్టుచీర కొంగు కప్పుకుని తల్లో పువ్వులు, ముక్కుకు, చెవులకు రవ్వలు మెరుస్తుండగా, బంగారు మేని ఛాయతో, నవ్వు ముఖంతో, మధుర గాత్రంతో, గంధర్వగానం చేసే ఎం.ఎస్.సుబ్బులక్ష్మి అపర సరస్వతీదేవే! ఈమెలో ఏదో దైవత్వం ఉంది.

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Click here to share your comments on this article.